క్లుప్తంగా

కేజీబీవీ సందర్శన

ముదిగొండ: మండల పరిధిలోని న్యూలక్ష్మీపురంలోని కేజీబీవీని తహసీల్దార్ సునీత శనివారం సందర్శించారు. విద్యార్థినుల హాజరు వివరాలను కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఇందిరను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఎర్రుపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం వచ్చే నెల ఒకటో తేదీ కల్లా మీసేవా కేంద్రాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పొట్టపింజర చిట్టిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష వచ్చే నెల 23వ తేదీన నిర్వహిస్తారని, పేరెంట్స్ తమ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు.

చోరీ ఘటనపై కేసు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా అక్కడి నుంచి నాలుగు గేర్ రాడ్లతో పాటు 30 లీటర్ల డీజిల్‌ను ఈనెల 15న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈఘటనతో రూ.15 వేల నష్టం వాటిల్లిందని సూపర్‌వైజర్ మేడ అప్పలస్వామి శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. అలాగే, స్టేషన్ సమీపంలోని చెవుల శ్రీను డబ్బా కొట్టు తాళాలు ధ్వంసం చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేత



చెక్కు అందజేస్తున్న కృష్ణ ప్రసాద్

మధిర: మధిర రైతు సేవా సహకార సంఘంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గోపినాథ్‌కి సంఘం నుంచి మంజూరైన చెక్కును శనివారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడా గోపినాథ్ అనేక సంవత్సరాలుగా సహకార సంఘంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రైతులకు మెరుగైన సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మధిర బ్రాంచ్ మేనేజర్ కొల్లా రవికుమార్, డైరెక్టర్ పుచ్చకాయల వెంకటనారాయణ, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ గోపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలి



బాధితుడికి ఫోన్ అందిస్తున్న ఎస్సై

చింతకాని: సెల్‌ఫోన్ దొంగిలించినా, ఎక్కడైనా పోగొట్టుకున్నా వాటిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. శనివారం మండలంలోని వందనం, మత్కేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఐఈఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి సదరు యువకులకు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సత్తుపల్లిరూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాకృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పసల రామ్మూర్తి, రూపాక సుధీర్‌లపై కేసు నమోదు చేయాలని కోరుతూ శనివారం మండల ఇన్‌చార్జ్ గొల్లమందల ముత్తారావు, గోళ్లమూడి శ్రీనివాసరావు పరిగదుపు లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో శనివారం సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నల్లంటి అశోక్, దువ్వూరి రమేష్, గద్దల దేవన్న సంతోష్, గద్దల శ్రీనివాస్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీబాలాజీ భవనంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి శ్రీబాలాజీ భవనం కన్వీనర్ కర్నాటి శ్రీనివాసరెడ్డి, ఎస్‌జేకేఎం కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పాఠశాలల విద్యార్థులకు యోగి వేమన రచించిన పద్యాల పోటీలను నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలికాలం.. జర భద్రం

- కమ్మేస్తున్న పొగమంచుతో ముప్పు
- నిర్ణీత వేగంతో ప్రయాణం సురక్షితం

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఉదయంపూట మంచు తగ్గిన తర్వాత వెళ్లటమే మంచిది.
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే ఖచ్చితంగా లైట్లు వేసుకొని వెళ్లాలి.
- వాహనాలను తక్కువ వేగంతో వెళ్లాలి.
- రాత్రి వేళ, తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం వాయిదా వేసుకోవటం మంచిది.
- చలికి చేతులు పటుత్వాన్ని కోల్పోయే అవకాశం ఉంది. జాగ్రత్తలు తప్పని సరి.
- ప్రయాణ సమయంలో ఇతరులకు స్పష్టంగా కన్పించేలా వాహనానికి రేడియం స్టిక్కర్లు ముందు, వెనుక అతికించాలి.
- పార్కింగ్‌లైట్లు వేసి డ్రైవింగ్ చేయటం వల్ల ముందు, వెనుక వచ్చే వాహనాలకు స్పష్టంగా అర్థమౌతుంది.
- వాహనాల మధ్య ఖచ్చితమైన దూరం పాటించాలి. డివైడర్ల వద్ద సూచికలు గమనించి జాగ్రత్తగా వెళ్లాలి. వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు.



పొగమంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు



సత్తుపల్లిటౌన్: చలితో పల్లెలు వణుకుతున్నాయి. ఈ ఏడాది చలి తీవ్రత పెరగడంతో ప్రజలు రాత్రివేళలో బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతకు వ్యాధులు విజృంభించే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వాహనదారులు రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహనాలు అగపడక పక్కనే నిలిపివేస్తున్నారు. పొగమంచుతో వాహనదారులకు ముప్పు పొంచి ఉందని జాగ్రత్తలు పాటించాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు. మంచుకురిసే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. తెల్లవారుజామున వాహనాలు నడిపేవారు.. రోడ్డుపై నడిచేవారు అప్రమత్తంగా ఉండాలి.. లేదంటే ప్రమాదాలు సంభవించి విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. చిన్నపాటి అప్రమత్తతతో ప్రమాదాల బారినపడకుండా ఉండవచ్చు.

జరిగిన ప్రమాదాలు..

ఈ నెల 5వ తేదీన వేంసూరు పెట్రోల్‌బంక్ నుంచి ద్విచక్రవాహనంపై రహదారిపైకి వస్తున్న ఫార్మసీ విద్యార్థి ఎస్‌కె.అఫ్జల్ పొగమంచుతో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గత నెల సింగరేణి బైపాస్‌రోడ్‌లో జరిగిన ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ నెల 12వ తేదీన కొణిజర్ల శివారులో తెల్లవారుజామున పొగమంచులో ఇసుక లారీ, బస్సు, కంటైనర్‌లను ఢీ కొనటంతో పలువురికి స్వల్పగాయాలు కాగా, గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయింది. ఇలా పొగమంచు, నిద్రమత్తులో జిల్లాలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..



పొగమంచు సమయంలో వాహనాలకు హెడ్‌లైట్, పార్కింగ్‌లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లాలి. వైఫర్ కండీషన్‌లో పెట్టుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపితే పార్కింగ్ లైట్లు వేసుకోవాలి. మంచు వీడే వరకు అత్యవసరం కాకపోతే ప్రయాణం వాయిదా వేయటం ఉత్తమం.

– జి.ఎస్.శ్రీనివాస్, ఎంవీఐ, సత్తుపల్లి

రోడ్డు భద్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.ఎస్. శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా.. శనివారం సత్తుపల్లి కేపీఆర్ గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారిపై ఉండే సూచనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. డ్రైవర్లు మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దన్నారు. రోడ్డుపై నడిచేవారు ఇటువంటి పొరపాట్లు చేయొద్దన్నారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దినేష్, కేపీఆర్ గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ మందపాటి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు..

మధిర: మండలంలోని ఖాజీపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఎస్‌టీఎఫ్ నాయకులు కమల్, మండల మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అయేషా కమల్ వితరణతో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్..



వీల్ చైర్‌ను వితరణగా అందజేస్తున్న అన్నపూర్ణ

పెనుబల్లి: జోనెబోయిన చారిటబుల్ ట్రస్టు ద్వారా దివ్యాంగుడికి శనివారం వీల్ చైర్‌ను వితరణగా అందజేశారు. శనివారం మండలంలోని పాతకారాయిగూడెం తండాకు చెందిన గుగులోత్ భద్రుకు చిన్నతనం నుండి ఒక కాలు పనిచేసేది కాదు. అయినప్పటికీ కష్టపడి చదువుకుని డిగ్రీ పూర్తి చేసి, బీఈడీ కోర్సు పూర్తి చేసే సమయానికి రెండో కాలు కూడా చచ్చుపడి పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమై బీఈడీ పరీక్షలు రాయలేకపోయాడు. దీనికి తోడు వికలాంగ పింఛన్‌కూడా రాకపోవడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. విషయాన్ని మండాలపాడు జోనెబోయిన చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు జోనెబోయిన అన్నపూర్ణ తెలుపగా.. వెంటనే స్పందించి రూ.7 వేల విలువైన వీల్ చైర్‌ను భద్రు భార్య కృష్ణవేణికి అందజేశారు. తమ కూతురును చదివించే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నామని దాతలు సహకరించాలని కృష్ణవేణి కోరారు.

శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి..



రూ.25,116 లు అందజేస్తున్న సుధాకర్‌బాబు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీద్వారకాపురి కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కోటగిరి సుధాకర్‌బాబు, శైలజ, కుమారులు చరణ్‌తేజ్, సాయివేదిత, హంసిక కుటుంబ సభ్యులు రూ.25,116లు ఆలయ నిర్వాహకులకు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, ఉబ్బల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, వ్యవస్థాపకులు రాగాల చంద్రారెడ్డి, చైర్మన్ సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అల్పాహారానికి..



అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

కల్లూరు: హైదరాబాద్ స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు వుయ్యూరి శ్రీవ్యాల్ ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల అల్పాహారానికి రూ.36 వేలు వితరణ చేశారు. శనివారం ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ పత్తిపాటి నివేదిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వరకా రామారావు, పసుపులేటి వీరరాఘవయ్య, వాలంటీర్లు ఉబ్బన బాబూరావు, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా గత ఏడాది ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పనులు



రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తల్లాడ: తల్లాడ నుంచి కొత్తగూడెం రోడ్డు ధ్వంసం కాగా కొత్తగా రోడ్డు వేశారు. ఈ రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని సీపీఎం నాయకులు ఆరోపించారు. శనివారం సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు మోహన్‌రావు, చెన్నయ్య, రాఘవులు రోడ్డును పరిశీలించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణం తర్వాత సైడ్ తోలాల్సిన గ్రావెల్‌కు బదులుగా నల్లమట్టిని రోడ్డు పక్కనే గుంతలు పెట్టి జేసీబీ సహాయంతో సైడ్ నింపుతున్నారని, దీంతో బురదమయంగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నల్లమట్టికి బదులుగా గ్రావెల్ తోలాలని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ



తహసీల్దార్ ఉషాశారద

మధిర/ఎర్రుపాలెం: రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని తహసీల్దార్లు రాళ్లబండి రాంబాబు, ఉషాశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో పేరు రాని వారు ఆందోళన చెందొద్దని.. అర్హులందరికీ రేషన్‌కార్డు మంజూరు చేయడం జరుతుందని తెలిపారు.

తహసీల్ ఎదుట ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బోనకల్: అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందించాలని కోరుతూ.. సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల సర్వే సక్రమంగా జరగలేదని, అనేకమంది అర్హులకు రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాలేదన్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే రైతు బరోసా, ఇందిరమ్మ ఆత్మీయ బరోసా అర్హత ఉండాలంటే రేషన్‌కార్డు ప్రామాణికంగా నిబందనలు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యంగల ఆనందరావు, జక్కుల రామారావు, ఆకెన పవన్, వంగాల కృష్ణ, గుంపుల జయరాజు, సంగమేశ్వరరావు, శ్రీనివాసరావు, మనీషా, గిరి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

మధిర: మధిర పట్టణంలో మున్సిపాలిటీ రహదారులను ఆక్రమించి దుకాణాల ముందు నిర్మించిన షెడ్లను, బోర్డులను పోలీస్ బందోబస్తుతో శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆక్రమణలపై అధికారులకు ఆదేశాలు జారీ చేయగా.. మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి రహదారిపై పెట్టిన దుకాణాలను, ఆక్రమణలను తొలగించారు. దీంతో చిరు వ్యాపారులు ఏళ్లుగా దుకాణాలను నడుపుకుంటూ జీవిస్తున్నామని.. తమ ఉపాధిని తీసివేయొద్దని కమిషనర్ సంపత్‌కుమార్‌ను వేడుకున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

పెనుబల్లి: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు విఠల్‌రావు, మండల కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి



చింతకాని: వందనంలో సర్వేను తనిఖీ చేస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్



ఎర్రుపాలెం: జమలాపురంలో సర్వే చేస్తున్న అధికారులు



బోనకల్‌లో..

చింతకాని: ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ అధికారులకు సూచించారు. మండలంలోని వందనం, కొదుమూరు, లచ్చగూడెం గ్రామాల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలపై నిర్వహిస్తున్న సర్వేను శనివారం ఆయన తనిఖీ చేసి.. సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు చేయని భూముల పరిశీలన..

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, రేమిడిచర్ల గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు సాగు చేయని భూములను పరిశీలించారు. భూముల వివరాలను ఆర్‌ఐ రవికుమార్, ఏఈఓ కూరెళ్ల వంశీకృష్ణ పరిశీలన చేశారు.. గుట్టలు, రాళ్లు, కోళ్లఫారాలు, లేఅవుట్స్, వ్యాపార నిమిత్తం కట్టడాల భూములన్నింటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.

పెనుబల్లి: మండలంలోని చింతగూడెంలో రైతు భరోసా సర్వేను రెవెన్యూ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఆర్‌ఐ సుబ్బారావు, వ్యవసాయాధికారి ఏపీఎస్ ప్రసాద్‌రాజు, ఏఈఓ హర్ష నందిని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలో మండలంలోని న్యూలక్ష్మీపురం, చిరుమర్రి గ్రామాల్లో రైతు భరోసా పథకానికై చేపడుతున్న సర్వేను ఏఓ వేణు, తహసీల్దార్ సునీత, ఏఈఓలు సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు సంబంధించిన సర్వేను సిబ్బంది త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ పున్నం చందర్ ఆదేశించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సర్వే తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌ఐ లక్ష్మణ్, ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓలు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంలో శనివారం ఖమ్మం పట్టణానికి చెందిన మాక్స్ విజన్ ఐ కేర్ ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ కంకణాల భిక్షాలు సీపీఎం వైరా డివిజన్ కమిటీ సభ్యుడు దొడ్డపనేని కృష్ణార్జునరావు శిబిరాన్ని ప్రారంభించారు. 100 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ అఫ్జల్, మిద్దె రామారావు, అనుమోలు వెంకటేశ్వర్లు, షేక్ సైదా, కంకణాల సుదర్శన్, మాక్స్ విజన్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

‘ముత్తూట్’ మినీ బ్రాంచ్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

కల్లూరు: కల్లూరు పట్టణ కేంద్రంలో ముత్తూట్ ఫైనాన్స్ మినీ బ్రాంచ్ కార్యాలయాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర అధికారి మధన్‌రాజ్, జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, రీజనల్ మేనేజర్ నాగరాజు, అడ్మిన్ రాయల శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారులు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కల్లూరులో బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం యూపీఎస్ రోడ్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ఎనుముల సత్యనారాయణ, ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి, కల్లూరు బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

లెనిన్ వర్ధంతి సభను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్: ఈ నెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మార్క్సిస్ట్ ఉపాధ్యాయుడు లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎ.వెంకన్న అన్నారు. ఈ మేరకు శనివారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని నీలం రామచంద్రభవన్‌లో లెనిన్ శత వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు శ్రీను, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు శరత్, మండల కార్యదర్శి రాజు, వెంకటేష్, నాగప్రసాద్, భాస్కర్‌రావు, కృష్ణ, కృష్ణవేని, వెంకటమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ



న్యూలక్ష్మీపురంలో కాటమయ్య కిట్లు అందిస్తున్న తహసీల్దార్

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురం గ్రామాల్లో కల్లుగీతకార్మికులకు శనివారం కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. కిట్లు వినియోగంపై కల్లుగీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఆర్‌ఐ ప్రసన్నకుమార్, నేలకొండపల్లి ఆబ్కారీ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దేవేంద్రం, కల్లుగీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు ఎనలేనివి

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించి మాట్లాడారు. పేదప్రజల సంక్షేమం కోసం పాటుపడిన మహానేత ఎన్టీఆర్ అని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం, రక్తదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



కారేపల్లి: కొత్తకమలాపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



సత్తుపల్లి: ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మట్టా దయానంద్, తదితరులు



మధిరలో నివాళులర్పిస్తున్న నాయకులు



వైరా: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు